ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, మార్చి 7, 2026 | సంపుటి - 22 | సంచిక 160 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## ఈ యుద్ధం ముగిసేదెలా ?

6

పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది.




## సివిల్స్ ఫలితాలు విడుదల

- సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు
- అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

న్యూఢిల్లీ, నినాదం: సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రా ల్లోని అభ్యర్థులు సత్తా చాటారు.

2



## అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

- ఇద్దరు పైలట్లు దుర్మరణం
- ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్

న్యూఢిల్లీ, నినాదం: అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం.




2

## ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళా

అగ్రికల్చర్ వర్సిటీ విసి వెల్లడి

హైదరాబాద్, నినాదం: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు.

## అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

- వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి
- సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



హైదరాబాద్, నినాదం: అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు.

తరువాయి 2లో..

## 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

- ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం
- ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు

2



న్యూఢిల్లీ,మార్చి6(నినాదం): కేంద్ర బడ్జెట్‌పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బడ్జెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు.

# మాది ప్రజాప్రభుత్వం

ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యం

## అధికారుల అక్రమ సంపాదనకు అవకాశం లేదు



### మాటలు, మూటలతో గెలిచి రాలేదు

- వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా
- మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

2

రంగారెడ్డి బ్యూరో, మార్చి 6(నినాదం): తమది పూర్తిగా ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మీది మీరంతా కోరుకుంటే , ప్రజా పాలన రావాలి, ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న బలమైన ఆకాంక్షతో 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారన్నారు. 2023 లో మా దగ్గర అధికార యంత్రాంగం, అక్రమ సంపాదన లేదు.

# ప్రజలను ఏమార్చే పాలన

## రెండేళ్లుగా అదే చేస్తున్నారు

- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు

**ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ ఫైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని హరీష్ రావు ప్రశ్నించారు.**



హైదరాబాద్, నినాదం: గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన` ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు.

2 వివరాలు

## మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నినాదం: క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం



- యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం
- అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు
- అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం
- ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు
- డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి
- అమెరికా ఆస్తులపైనే మా దాడులు
- అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు
- ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే
- పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి
- 200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన

6 వివరాలు

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



హైదరాబాద్, నినాదం: తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఎర్రబెల్లి స్వర్ణకు వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పనిచేశారు.

2



## ప్రజాపాలన - ప్రగతికి సరికొత్త బాట

- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ప్రతినిధి, (నినాదం): ప్రజలకు మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

2 వివరాలు

## జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్ళతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

2 వివరాలు

## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

అమరావతి,మార్చి6(నినాదం): రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు.

## మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

కొత్వాల్ గూడ ఎకో పార్క్ ప్రారంభించిన సిఎం రేవంత్



## ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

15 రోజులు సమావేశాలు జరిగాయి

వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



# ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినాల్సిన సూపర్ ఫుడ్స్ ఇవే..!

గంటల తరబడి మిమ్మల్ని పూర్తి శక్తితో ఉంచుతుంది. మంచి ఆహారం సాధారణంగా ఫైబర్, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సూక్ష్మ పోషకాలను కలిగి ఉంటుంది. అందుకే ఉదయం ఖాళీ కడుపుతో తీసుకునే ఆహారం, పానీయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మీరు మీ కడుపు, పేగు, మొత్తం జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ఉదయం ఖాళీ కడుపుతో ఎలాంటి ఆహారం తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.





అరటిపండ్లు: ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ అవసరమైనంత మేర ఉన్న అరటిపండ్లు మంచి బ్రేక్‌ఫాస్ట్‌గా చెప్పొచ్చు. ఉదయాన్నే రెండు అరటి పండ్లు తినడం వల్ల మీరు రోజును అధనపు శక్తితో ప్రారంభించవచ్చు. బ్లడ్ షుగర్ తక్కువగా ఉన్నప్పుడు అరటిపళ్లలోని కార్బోహైడ్రేట్లు ఎనర్జీ బూస్టర్స్‌గా పనిచేస్తాయి. అదనంగా అరటిపళ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. సెరోటోనిన్ మనల్ని రిలాక్స్‌గా, సంతోషంగా ఉండేలా చేస్తుంది. కాబట్టి అల్పాహారానికి ముందు అరటి పండు తింటే మంచిదంటున్నారు నిపుణులు. అయితే గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడపున అరటి తినకపోవడమే మంచిది.

**ఖర్జూరం:**
ఖర్జూరం మీ రోజువారీ ఆహారంలో ఆరోగ్యకరమైన స్వీట్‌గా చెప్పొచ్చు. సరైన ఆరోగ్యాన్ని పొందడంలో సహాయపడే అన్ని రకాల పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ఖర్జూరాల్లో కార్బోహైడ్రేట్స్, డైటరీ ఫైబర్, ప్రొటీన్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, కాల్షియం, సోడియం మొదలైన ఖనిజాలు, విటమిన్లు ఏ, బీ1, బీ2, జ సమృద్ధిగా ఉంటాయి. మీ రోజువారీ ఆహారంలో ఖర్జూరాలను చేర్చుకోవడం వల్ల ఫ్రీ రాడికల్ డ్యామేజ్‌ను నివారించొచ్చు. కరోనరీ హార్ట్ డిసీస్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



**ఆపిల్స్..**
విటమిన్ ఏ, బీ, జ, జు, ఖ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, జింక్, ఫైబర్, ప్రొటీన్ వంటి పోషకాలు ఆపిల్స్‌లో పుష్కలంగా లభిస్తాయి.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఆపిల్‌ను తింటే ఎక్కువ లాభాలు పొందొచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. అందులో ఉండే విటమిన్ సి ని శరీరం త్వరగా గ్రహిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు ఖాళీ కడుపుతో ఆపిల్ తింటే చాలా మేలని అంటున్నారు. గుండె జబ్బులు వచ్చే రిస్క్ సైతం తగ్గుతుంది. అంతేకాదు ఖాళీ కడుపుతో ఆపిల్ ను తింటే మలబద్ధకం సమస్య దూరమవుతుంది. శరీరంలో వాపులు తగ్గుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. శరీరం రోజంతా యాక్టివ్‌గా ఉంటుంది.




**బాదంపప్పు..**
బాదంపప్పులో విటమిన్ జు పుష్కలంగా ఉంటుంది. బాదంపప్పును సలాడ్ రూపంలో పచ్చిగా కూడా తినొచ్చు. లేదంటే ప్రొటీన్ షేక్‌లో యాడ్ చేసుకున్నా సరే. మీరు కాఫీకి ప్రత్యామ్నాయంగా బాదం పాలను కూడా తాగొచ్చు. విటమిన్ జు, ప్రొటీన్, ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మాంగనీస్, ఫైబర్‌తో నిండిన బాదం మీకు బెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ అవుతుంది. కానీ వాటిని రాత్రంతా నానబెట్టిన తర్వాత తినడం మంచిది.



**గుడ్లు:**
గుడ్లు సహజంగా లభించే ఇతర ఆహారాల కంటే ఎక్కువ ప్రొటీన్లు కలిగి ఉంటాయి. ఉదయాన్నే గుడ్లు తినడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీంతో అతిగా తినకుండా ఉంటారు. కాబట్టి బరువు తగ్గేందుకు ఇదొక గుడ్ ఆప్షన్. గుడ్లలో ఐరన్, విటమిన్ డి, పొటాషియం, జింక్ ఉంటాయి. ఇవి మీ శక్తి స్థాయిలను పెంచుతాయి.

## పొరపాటున కూడా వీటిని ఫేస్‌కు పూయకండి..!



**మొటిమలకు టూత్‌పేస్ట్‌ను పూయడం:**
ఈ మధ్య చాలా వైరల్ అవుతున్న హ్యాక్ ఏమిటంటే మొటిమలకు టూత్‌పేస్ట్ పూస్తే అవి త్వరగా ఎండిపోతాయని చెప్పడం. కాని ఇది అస్సు నిజం కాదు. పేస్ట్‌లో చర్మానికి హాని కలిగించే అనేక రసాయనాలు ఉంటాయి. ఇలా ఫేస్‌కు పేస్ట్‌లు పూయడం వల్ల మొదట్లో మొటిమ ఎండిపోయినట్లు అనిపించవచ్చు, కానీ వాస్తవానికి ఇది చర్మాన్ని మరింత పొడిగా చేస్తుంది. ఇది ఎరుపు, చికాకు, చర్మాన్ని పొడిబారేలా చేస్తుంది.

**నిమ్మరసం:**



నిమ్మరసాన్ని సహజమైన బ్లీచ్ అని భావించి ప్రజలు తరచుగా తమ ముఖానికి నేరుగా రాసుకుంటారు. నిమ్మకాయలో విటమిన్ సి ఉంటుందనేది నిజమే అయినప్పటికీ, ఇది అధిక ఆమ్లత్వాన్ని కలిగి ఉంటుంది. దీన్ని నేరుగా ముఖానికి పూయడం వల్ల చర్మం చికాకు కలిగిస్తుంది. మీరు దీన్ని అప్లై చేసిన తర్వాత ఎండలోకి వెళితే, మీ చర్మం మరింత సున్నితంగా మారుతుంది, మచ్చలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కొంతమందికి అలెర్జీ ప్రతిచర్యలు లేదా దద్దుర్లు కూడా రావచ్చు.

**బేకింగ్ సోడా:**
కొంతమంది చర్మాన్ని క్లియర్‌గా, మెరిసేలా చేయడానికి బేకింగ్ సోడాతో స్క్రబ్ చేస్తారు. అయితే, బేకింగ్ సోడా చర్మం కంటే భిన్నమైన జూం స్థాయిని కలిగి ఉంటుంది. ముఖానికి అప్లై చేసినప్పుడు, ఇది చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తుంది, ఇది



పొడిగా, గరుకుగా, సున్నితంగా ఉంటుంది. దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల మొటిమలు, చికాకు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**బాడీ లోషన్:**



బాడీ లోషన్ అనేది మందపాటి చర్మాన్ని తేమగా ఉంచడానికి రూపొందించబడింది. ఇందులో సువాసనలు, వివిధ రసాయనాలు ఉంటాయి. ముఖ చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి మీ ముఖానికి బాడీ లోషన్ పూయడం వల్ల రంధ్రాలు మూసుకుపోతాయి, ఇది మొటిమలు, జిడ్డుగల చర్మానికి దారితీస్తుంది. అందువల్ల, ఎల్లప్పుడూ ముఖం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మాయిశ్చరైజర్‌ను ఉపయోగించండి.

**వేడి నీరు:**



శీతాకాలంలో చాలా మంది ముఖాన్ని వేడి నీటితో కడుక్కోవడానికి ఇష్టపడుతారు. అయితే, చాలా వేడి నీరు చర్మానికి హానికరం. ఇది చర్మం సహజ నూనెలను తొలగిస్తుంది. దీని వల్ల చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది. ఇప్పటికే పొడిబారడం లేదా ఎరుపు రంగు చర్మంతో బాధపడుతున్న వారికి, వేడి నీరు పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. అందువల్ల, ఎల్లప్పుడూ గోరువెచ్చని లేదా గది ఉష్ణోగ్రత నీటిని వాడండి.

## నానబెట్టిన కిస్‌మిస్‌తో ఎన్ని హెల్త్ బెనిఫిట్స్ తెలుసా?

ద్రాక్షలు.. చూసేందుకు చాలా చిన్నసైజు పండ్లు.. కానీ, ఇది శక్తివంతమైన పోషకాలతో నిండినవి. ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారు.

ఇందులో ఫైబర్, విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వాటిని రాత్రి నీటిలో నానబెట్టి, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. నిపుణుల ప్రకారం, నానబెట్టిన ద్రాక్షలను తినడం వల్ల శరీరంలో డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి పెరుగుతుంది. పూర్తి ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం...

నానబెట్టి కిస్‌మిస్ తినడం వలన జీర్ణశక్తి పెరుగుతుంది, గట్ హెల్త్ మెరుగవుతుంది. ఇందులో వాటర్ కంటెంట్, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వలన మలబద్ధకం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నానబెట్టిన కిస్‌మిస్‌లో పొటాషియం,ఇతర సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. దీని వలన గుండె పనితీరు మెరుగవుతుంది. నానబెట్టిన



ద్రాక్షల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రెషర్, కొలెస్ట్రాల్ లెవెల్స్ నియంత్రణలో సహాయపడతాయి. దీనివల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

నానబెట్టిన ద్రాక్షలు రుచి మాత్రమే కాకుండా ఫైబర్ కారణంగా కడుపును సక్రమంగా ఉంచి, పేగు సమస్యలు, కడుపు నిండినట్లు అనిపించడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్యను నివారించడంలో ఇది ఫలవంతంగా పని చేస్తుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలో నేచురల్ షుగర్స్‌తో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వలన తక్షణ ఎనర్జీ లభిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. స్కిన్ హెల్త్ మెరుగవుతుంది. నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ మితంగా తీసుకోవడం ఎంతో ముఖ్యం.

నానబెట్టిన ద్రాక్షలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు ఉండటంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ప్రతిరోజు ఖాళీ కడుపుతో నానబెట్టిన ద్రాక్షలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. ఉద్యోగ, చదువులు లేదా వ్యాయామంలో అలసట తక్కువగా ఉంటుంది. అదనంగా, ఇది బోన్లు, దంతాల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్రతి రోజు రాత్రి నానబెట్టి, ఉదయం 5-10 ద్రాక్షలు తినడం, శక్తివంతమైన, ఆరోగ్యకరమైన అలవాటు. ఇది శరీరానికి, చర్మానికి, హృదయానికి, జీర్ణక్రియకు, ఇమ్యూనిటీకి ఎంతో మేలు చేస్తుంది.

## ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచండి.. రిఫైనరీలను కోరిన కేంద్ర ప్రభుత్వం

నినాదం మార్కెట్



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. దీంతో వంటగ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. దేశీయ సరఫరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ ఎల్‌పీజీ ప్రభుత్వరంగ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు మాత్రమే విక్రయించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఆ సరఫరాలు దేశీయ వినియోగదారులకు మాత్రమే చేరేలా చూడాలని ఆ మూడు సంస్థలకు సూచించింది. ఎల్‌పీజీని ఉత్పత్తి చేయడానికి కీలకమైన ప్రొపేన్, బ్యూటేన్‌ను పెట్రో కెమికల్ ప్రొడక్షన్ కోసం దారి మళ్లించవద్దని కేంద్రం రిఫైనరీలకు స్పష్టం చేసింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా దేశంలో ఎల్‌పీజీ గృహ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 60 శాతం దిగుమతుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దాంతో అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, రవాణాలో అంతరాయాలు ఏర్పడినా దేశీయంగా ఆ ప్రభావం కనిపిస్తుంటుంది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రియులకు శుభవార్త..

### ఈ నెలలో మరో పవర్‌ఫుల్ బైక్..!

రాయల్ ఎన్‌ఫీల్డ్ 450సిసి లైనప్‌లో హిమాలయన్ 450, గెరిల్లా 450 ఉన్నాయి. గెరిల్లా 450 మొదట 2024లో ప్రారంభించింది. కంపెనీ ఇప్పుడు మోటార్‌సైకిల్ అప్‌డేట్ వెర్షన్‌ను దేశానికి తీసుకురావాలని యోచిస్తోంది.

కంపెనీ ఈ మోటార్‌సైకిల్‌ను మార్చి 2026 చివరి నాటికి విడుదల చేయనుంది. మోటార్‌సైకిల్ ప్రారంభించిన తర్వాత ఇది మొదటి అప్‌డేట్ అవుతుంది. కొన్ని ముఖ్యమైన మార్పులను కలిగి ఉంటుందని భావిస్తున్నారు.

ప్రస్తుతానికి రాయల్ ఎన్‌ఫీల్డ్ అప్‌డేట్ వివరాలు, రైడర్ అనుభవానికి తీసుకువచ్చే మార్పుల గురించి పెద్దగా వెల్లడిం చలేదు. బ్రాండ్ గత నమూనాను పరిశీలిస్తే, గేర్‌బాక్స్‌లో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. భారతదేశంలో హంటర్ 350 అప్‌డేట్ చేసిన వెర్షన్‌లో కూడా ఇలాంటి మార్పు కనిపించింది. ఈ మార్పులు ప్రధానంగా రైడర్ సౌకర్యం, మోటార్‌సైకిల్ నియంత్రణను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**కొత్త కలర్స్ ఆప్షన్:**



అదేవిధంగా కంపెనీ కొన్ని మార్పులు చేయవచ్చు.

ఈ మార్పులు కొత్త రంగు ఎంపికలతో పాటు, దాని రూపాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ప్రస్తుతం ఈ బైక్ బ్రావా బ్లూ, షాడో యాష్, పిక్స్ బ్రాంజ్, స్మోక్ సిల్వర్, ప్లేయా బ్లాక్, గోల్డ్ డిప్ రంగులలో లభిస్తుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ గెరిల్లా 450 రూ.2.56 లక్షల నుండి (ఎక్స్-షోరూమ్) ప్రారంభమవుతుంది.

ఇది షెర్పా ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది హిమాలయన్ 450కి కూడా శక్తినిస్తుంది. ఈ 452సిసి, లిక్విడ్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజిన్ 40 హార్స్‌పవర్, 40 చీఎ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది రైడ్-బై-వైర్ సిస్టమ్, రెండు రైడింగ్ మోడ్‌లతో ఆరు-స్పీడ్ గేర్‌బాక్స్‌తో జత చేసింది.

ఈ మోటార్ సైకిల్ లో 43ఎంఎం టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కులు ఉన్నాయి. ఇవి 140ఎంఎం వీల్ ట్రావెల్ ను అందిస్తాయి. వెనుక భాగంలో 150ఎంఎం మోనో-షాక్ సస్పెన్షన్ కూడా ఉంది. ముందు భాగంలో డ్యూయల్-పిస్టన్ కాలిపర్‌తో కూడిన 310ఎంఎం వెంటిలేటెడ్ డిస్క్ బ్రేక్, వెనుక భాగంలో 270ఎంఎం సింగిల్-పిస్టన్ డిస్క్ బ్రేక్ బ్రేకింగ్‌ను నిర్వహిస్తాయి. భద్రత కోసం డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ కూడా చేర్చింది. బైక్ 17-అంగుళాల చక్రాలపై నడుస్తుంది.

## 25వేలలో ఫోన్ చూస్తున్నారా? మోటో నుంచి కొత్త ఫోన్

ఎడ్జ్ సిరీస్ ఫోన్లతో ఇండియన్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక మార్క్ సంపాదించిన మోటోరొలా.. ఎడ్జ్ 70 సిరీస్‌లో కొత్త ఫోన్‌ను లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీతో ఎడ్జ్ 70 ఫ్యూజన్‌ను విడుదల చేసింది. రూ.25 వేల బడ్జెట్‌లో పేరొందిన బ్రాండ్‌లో మంచి స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నవారు ఈ ఫోన్‌ను పరిశీలించొచ్చు. ఇంతకీ ఈ ఫోన్ ఎలా ఉంది? అప్‌డేట్స్ మాటేంటి?

మోటోరొలా ఎడ్జ్70 ఫ్యూజన్ 6.78 అంగుళాల సూపర్ హెచ్‌డీ 1.5K ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. 144 Hz, హెచ్‌డీఆర్ 10ం, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో



ఈ డిస్‌ప్లే పనిచేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటక్షన్ ఉంది. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలోయూఐతో పనిచేస్తుంది. 3 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-710 ప్రధాన కెమెరా ఉంది. 13 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3 ఇన్ 1 లైట్ సెన్సర్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ఇందులోని 7000 ఎంఏహెచ్ బ్యాటరీ 68ఔ టర్బోపవర్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. దీని బరువు 193 గ్రాములు.

**నథింగ్ 4ఏ, 4ఏ ప్రో విడుదల.. ధర, స్పెసిఫికేషన్లు ఇవే..**

ఇక ధర విషయానికొస్తే.. మోటో ఎడ్జ్ 70 ఫ్యూజన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం 128జీబీ వేరియంట్ రూ.26,999, 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.29,999, 12జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.32,999గా నిర్ణయించారు. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. లేదా పాత ఫోన్ ఎక్స్ఛేంజీపై రూ.2వేలు అదనంగా ఇస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ.24,999 నుంచే ప్రారంభమవుతుంది. మార్చి 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. నేటి (మార్చి 6న) మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఫ్లిప్‌కార్ట్‌లో ఎర్లీబర్డ్ సేల్ నిర్వహించనున్నారు.

### అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌పై
## ఈడీ దాడులు

ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీ కి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ (ఏణాూ+) కంపెనీ రిలయన్స్ పవర్‌కు సంబంధించి ముంబయి, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా 15 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ ఫిబ్రవరి 27న ఈడీ విచారణకు హాజరుకావాల్సిఉంది. అయితే ఆయన గైర్హాజరైన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు



రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై ఈడీ కేసు నమోదైంది. వీటి మొత్తం విలువ రూ.40వేల కోట్లుగా పేర్కొంది.

## మల్లేష్ యాదవ్ దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు




**కాప్రా, మార్చి 6 ( నినాదం ) :** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రగొళ్ల మల్లేష్ యాదవ్ -- బుచ్చమ్మ దంపతుల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారి దాంపత్య జీవితం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విటల్ యాదవ్, సంపత్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన ఎమ్మెల్యే



**కాప్రా, మార్చి 6 ( నినాదం ) :** నాచారం సర్కిల్ హెచ్ బి కాలనీ డివిజన్ సెయింట్ పాల్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ హెచ్ బి కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు వంజరి ప్రవీణ్ కరిపే సహకారంతో ఏర్పాటు చేసిన పరీక్ష ప్యాడ్ లు మరియు జామెంట్రీ బాక్స్ లను విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య లు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి పరీక్షలు దగ్గర పడుతున్న వేళ సమయం ఎక్కువ వెచ్చించి ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలని, మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకుని రావాలని మీ బంగారు భవిష్యత్తుకు మార్గం ఏర్పాటు చేసుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉందని, చదువులో మీ సత్తాను మీరు నిరూపించుకునే సమయం ఇదే అని గుర్తు చేశారు. స్థానిక నాయకులు ఉల్లెం బాలరాజు, మల్లేష్ గౌడ్, దేవేందర్ కుమార్, వసంత రావు, వాసు చారి, నవీన్ గౌడ్, మధు ముదిరాజ్, రామకృష్ణ, కిరణ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, మార్చి 6 (నినాదం):** రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, అధికార ప్రతినిధి డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి లో ఇతర నేతలతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాల నుంచి శుభాకాంక్షలు తెలిపారు. ×ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి గారికి పుష్పగుచ్ఛం అందజేస్తూ వేం నరేందర్ రెడ్డి రానున్న కాలంలో రాజకీయ ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి,కే ఏం గౌరీష్,బట్ట పాలకృష్ణ,గడ్డం రాజేందర్ రెడ్డి,మన్నే రాజు, లక్ష్మ రెడ్డి,మైసిగారి శ్రీనివాస్, రషీద్, ఆలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దోహదం

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**రంగారెడ్డి బ్యూరో, మార్చి 6 (నినాదం) :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి ప్రధాన అంశాలపై చర్చించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు వస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జి ఐటీ, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో జవాబుదారీ తనంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ అందని వారిని గుర్తించి నిర్లక్ష్యం వహించకుండా అమలు కాని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 99 రోజుల పాటు చేపట్టే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకుప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లను కేటాయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం..

# 2కె రన్ అవగాహన






**వికారాబాద్, మార్చి 6(నినాదం ):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ ఆధ్వర్యంలో 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో వివిధ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు పిల్ల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి నిన్నదించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం గౌరవ డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిధిలోని కొడంగల్ లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ నినాదాలతో యువత ముందుకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, తదితరులు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యువత తమ శక్తిని క్రీడలు, విద్య ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని వారు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, యువత భవిష్యత్తును కాపాడటమే పోలీస్ శాఖ, ఈగల్ టీమ్ ల ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేశారు. మహిళలు విద్య, ఉద్యోగం, క్రీడలు ఇతర రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం కొడంగల్‌కే పరిమితం కాకుండా, వికారాబాద్ జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్ల పరిధిలోని 76 గ్రామాలలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన ర్యాలీలు, సమావేశాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో డ్రగ్స్ పై చైతన్యం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని జిల్లా సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగించి డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణ మూర్తి, జిల్లా అదనపు ఎస్పీ బి రాములు నాయక్, పరిగి డి ఎస్పీ శ్రీనివాస్, డీటీసీ డి ఎస్పీ శ్రీనివాసులు, ఏ ఆర్ డి ఎస్పీ వీరేష్, కొడంగల్, నవాబుపేట రాంబాబు, బుచ్చయ్య ఎంపీడీఓ ఉష అరి, ఎం ఈ వో రాం రెడ్డి , మునిసిపల్ ఛైర్మన్ ప్రశాంత్, మునిసిపల్ కమిషనర్ బలరాం నాయక్, మోమిన్ పేట సీ ఐ వెంకట్, నవాబుపేట ఎస్ ఐ పుండ్లిక్, సిబ్బంది, ఈగిల్ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాలు మరియు స్థానిక నాయకులు, వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో పరమేశ్వర్ రెడ్డి

# బస్తీబాట



**కాప్రా, మార్చి 6 (నినాదం ) :** కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర రెడ్డి బస్తీబాట కార్యక్రమంలో భాగంగా నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్, శక్తిసాయి నగర్ డివిజన్‌లలోని బ్రహ్మపురి కాలనీ, జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం కాలనీ, చండియా నగర్ కాలనీలలో పర్యటించి నేరుగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు తాగునీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. సమస్యలతో పాటు డ్రైనేజీ, రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. బస్తీలలో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధన్ పాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, నెమలి అనిల్ కుమార్, మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్, ఎస్ వి కిట్టు, బెల్లం గట్టియ్య, దంతురి రాజు గౌడ్, కోయగూర బాలరాజ్, మక్తల బాలరాజ్, సురేష్, బెల్లం శ్రీను, జెమిలా బేగం, మధుసూదన్ రెడ్డి, సద్గుణ రావు, జానీ భాయ్, పార్వతాలు, శ్రీనివాస్, రాజేష్, శ్రీకాంత్ రెడ్డి, ఫిరోజ్, శైలజ, విజయ్ చారి, ఉపేందర్, సాయి టిల్లు, సాయి, జయంత్ తదితరులు పాల్గొన్నారు.


## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్, సొంటి రెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్ మార్చి 6 (నినాదం):** రంజాన్ వేడు కల సందర్భంగా రుడా మేస్త్రి నగర్‌లో సలీం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథు లుగా మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు రంజాన్ పర్వదినం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సలీం, బుచ్చిరెడ్డి, అన్వర్, నాయబ్ రసూల్, ఆబిద్, ఆరిఫ్, శిరీష్, తోషిఫ్, నవీద్, చాంద్ పాషా, మైనార్టీ సోదరులు, స్థానిక నాయకులు, ముస్లిం సోదరులు, కాలనీవాసులు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో 'నైట్ షో' మద్యం దందా!

### ప్రాణాలు పోతున్నా ఆగని అక్రమ విక్రయాలు!



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి06 (నినాదం):** సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా ఇప్పుడు మృత్యువుకు పొంచి ఉన్న అడ్డాగా మారింది. నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకే మద్యం షాపులు మూతపడాల్సి ఉన్నా, ఇక్కడ మాత్రం అర్ధరాత్రి 1 గంట వరకు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడ మద్యం కొనుగోలు చేసి, మత్తులో వాహనాలు నడుపుతూ ఎంతోమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఇక్కడ జరిగిన అనేక రోడ్డు ప్రమాదాలకు ఈ అక్రమ మద్యం విక్రయాలే ప్రధాన కారణమని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

**అహంకారపు మాటలు - అధికారుల మౌనం:**
ఈ అక్రమ విక్రయాలపై ప్రశ్నిస్తే, సదరు షాపు యజమాని అత్యంత అహంకారంతో మాట్లాడుతున్నాడు. "నాకు పోలీసులు, అధికారులు అందరూ తెలుసు.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ బహిరంగంగానే సవాల్ విసురుతున్నాడు. పట్టణ నడిబొడ్డున, పోలీసులు నిరంతరం తిరిగే ప్రాంతంలోనే ఇలాంటి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయంటే, అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**బలిపీఠంపై సామాన్యుడి ప్రాణం:**
ముంబై జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో భారీ వాహనాల రద్దీ ఉంటుంది. ఇక్కడ మద్యం విక్రయించడంతో లారీ డ్రైవర్లు, యువత మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయినా, మరికొందరు కాళ్లు చేతులు పోగొట్టుకుని వికలాంగులుగా మారుతున్నా.. ఎక్సైజ్ శాఖకు గానీ, స్థానిక పోలీసులకు గానీ పట్టింపు లేకపోవడం విచారకరం.

**ఇప్పుడైనా స్పందిస్తారా?**
బెల్టు షాపులపై దాడులు చేసే ఎక్సైజ్ అధికారులు, ఇంతటి భారీ దందాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? షాపు యజమాని మాటల వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవరు? ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు మరియు ఉన్నతాధికారులు స్పందించి ఈ షాపుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## డంపింగ్ యార్డ్‌లో చెత్తను సక్రమంగా వర్గీకరించి..

# శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలి

### డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మార్చి 6(నినాదం):** వికారాబాద్ పట్టణ పరిధిలోని గంగారం లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యర్థాల నిర్వహణ విధానం, శుభ్రత, వ్యర్థాల వర్గీకరణ పారిశుధ్య చర్యలపై అధికారులతో మాట్లాడారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తను సక్రమంగా వర్గీకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి రీసైక్లింగ్ చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని, దుర్వాసన కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పట్టణంలో 28 వ వార్డ్ ను సందర్శించి వార్డ్ సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెహికిల్ తిరిగి 100 శాతం తడి, పొడి చెత్త సేకరణ జరగాలని, వెహికిల్ లో జియో ట్యాగింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు

### కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మార్చి 6(నినాదం):** ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ లు వినయ్ కుమార్ రెడ్డి, సృజన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి ప్రధాన అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. జిల్లాలోని 4 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. అనంతగిరి ఈకో పార్క్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లాలోని 106 గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా పనిచేస్తామని ఆయన తెలిపారు.

ఈ అవగాహన సమావేశంలో శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇఫ్తార్ విందు

### పాల్గొన్న మాజీ హోం మంత్రి, ఎమ్మెల్యే





**అల్వాల్, మార్చి 6( నినాదం):** వెంకటాపురం డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ, బుర్హాని హౌసింగ్ సొసైటీలో ఉన్న సఫీ మసీదులో దావూదీ బోరాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు మహమ్మద్ అలీ, మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండ్లు, ప్రత్యేక భోజన విందు ఏర్పాటు చేశారు. అలాగే ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు, మౌజన్‌లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వహిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆధ్యాత్మికతకు నిదర్శనమని కొనియాడారు. రంజాన్ పర్వదినం సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముస్లిం సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింల సౌకర్యార్థం దుకాణాలు ఎక్కువ సమయం తెరిచి ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముస్లింలకు అందే రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందులకు నజరానా అందేలా కృషి చేశామని, మొహరం పండుగ సందర్భంగా అసుర్ ఖానా (పీర్ల కొట్టం) లబ్ధిదారులకు మొదటిసారిగా పారితోషికం అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే తన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శ్రీమతి సబితా అనిల్ కిషోర్ గౌడ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ గౌడ్, మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, జీకే హనుమంతరావు, అమినుద్దీన్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్ బాబు, లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, శివ, సాయి గౌడ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోరహ కమిటీ పెద్దలు అమర్ షేక్, యూసుఫ్, ముర్తుజ, హకీం, మహమ్మద్, జుబేర్ మానన్, ముస్లిం మత పెద్దలు, యువకులు మరియు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతివృత్తుల పోషణకు మంచి అవకాశాలు

## కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి మార్చి 6 (నినాదం) :** ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద చేతివృత్తుల కళల ప్రోత్సాహానికి మంచి అవకాశాలు ఉన్నాయని, అందువల్ల లబ్ధిదారులు కష్టపడి వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని బోయవాడ ఎస్ బి ఆర్ ఫంక్షన్ హాల్ లో సూక్ష్మ ,మధ్య, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంస్థ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించనున్న ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారుల వాణిజ్య ప్రదర్శనను ప్రారంభించారు. లబ్ధిదారులు ఏర్పాటు చేసిన వివిధ చేతి వృత్తులను పరిశీలించిన అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈ ఆధ్వర్యంలో చేతివృత్తుల కళాకృతుల ప్రోత్సాహంగా వ్యాపారాలను వృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశం ఉందని అన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం ద్వారా మొదటి విడుతన లక్ష రూపాయల రుణం మంజూరు చేయడం జరుగుతుందని, 18 నెలల్లో తీసుకున్న రుణం తిరిగి చెల్లిస్తే రెండవ విడత రెండు లక్షల రూపాయలను మంజూరు జరుగుతుందని చెప్పారు .ఎంఎస్ ఎం ఈ ద్వారా తక్కువ వడ్డీకి రుణం అందుబాటులో ఉండడం వల్ల చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారికి ఇది మంచిగా





ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో సుమారు 3580 మంది లబ్ధిదారులు ఎంఎస్ ఎం ఈ కింద దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ శిక్షణ నిర్వహించడం జరుగుతున్నదని, శిక్షణ పూర్తయిన తర్వాత వ్యాపార మెలకువలను అందిపుచ్చుకొని రుణంతోపాటు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ,దీని ద్వారా మరింత లబ్ధి పొందవచ్చు అని అన్నారు.పి ఎం విశ్వకర్మ 3 రోజుల వాణిజ్య ప్రదర్శన ద్వారా మార్కెట్ సదుపాయాలు, డిజిటల్ మార్కెట్ సౌకర్యం వంటి వాటిపై అవగాహన కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు.ఎం ఎస్ ఎం ఈ ద్వారా పొందిన ఋణంతో కష్టపడితే మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎంఎస్ ఎం ఈ ద్వారా అమలు చేసే పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎంఎస్ ఎం ఈ ద్వారా రుణం పొంది వారు నిర్వహించుకుంటున్న వ్యాపారాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎం సహాయ సంచాలకులు నవీన్ జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్, ఎల్ డి ఎం శ్రామిక్ ,మెప్మా పీడీ శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి సంజీవ, పోస్టల్ సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి భవనానికి శంకుస్థాపన



**కోదాడ, మార్చి 6 (నినాదం):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో మహిళల సాధికారతకు కేంద్రంగా నూతన స్త్రీశక్తి భవనానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కంటూ లాజర్ , ఉప సర్పంచ్ గింజుపల్లి జగన్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన భవనం గ్రామ మహిళలకు సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఉపయోగపడుతుందని వారు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో హరి సింగనాయక్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "భవనం మహిళలకు శక్తివంతమైన వేదికగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గింజుపల్లి రఘు, నాయకులు ఉయ్యాల వీరయ్య గౌడ్, వార్డు సభ్యులు సూరయ్య, రామయ్య, సైదమ్మ, కల్పన, శ్రావణి నాగేంద్రబాబు, మాధవి గోపి పాల్గొన్నారు.

### నవోదయ, గురుకుల శిక్షణకోసం

# ఉచిత ప్రవేశ పరీక్షలు

**అమరచింత, మార్చి 6, (నినాదం):** గురుకుల, నవోదయ సైనిక్ స్కూల్లో శిక్షణ తీసుకోబోవు విద్యార్థిని విద్యార్థులకు ఉచిత శిక్షణ కొరకై ప్రవేశ ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తర్ బేగ్, అక్షర స్కూల్ కరస్పాండెంట్ రాజ వర్ధన్ రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 8 3 2026 ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో, వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ అక్షర స్కూల్ పానుగల్ రోడ్డు నందు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తమకు అందుబాటులో ఉండే సెంటర్లకు హాజరుకావాలని కోరారు. ఈ పరీక్షలో మొదటి, రెండవ టాపర్స్ గా నిలిచిన వారికి జూన్ నుండి, ఫిబ్రవరి వరకు తమ కోచింగ్ సెంటర్లలో ఉచితంగా శిక్షణ అందజేయబడుతుందన్నారు 3,వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకుల శిక్షణకు,4వ, తరగతి చదువుతున్న విద్యార్థులు నవోదయ శిక్షణకు అర్హులని తెలిపారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం ఈ క్రింది సెల్ నెంబర్ 9441591776,891937717,81250 21571కు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజాపాలన

### ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

### కలెక్టర్ చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి మార్చి 6 (నినాదం):** ప్రజా ప్రతి నిధులు, అధికారులందరి సమ న్వయం, సహకారంతో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రో జుల కార్య చరణ ప్రణాళికను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని లైన్ వాడ పట్టణ ప్రాథమిక ఆరో గ్య కేంద్రం లో స్పెషలిస్ట్ డాక్టర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూపేదవారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రా ష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పా లన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా మార్చి 6 నుండి 31 వరకు జిల్లా లోని అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రా థ మిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఒక రోజు ఆరురకాల ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.ఇందుకు గాను నిపుణులైన డాక్ట ర్స్ ను పిలిపించడం జరి గిందని, ముఖ్యంగా డెంటల్, ఓబీజీ, ఆర్తో, ఆప్తమాలజీ, పీడి యాట్రిషన్ డాక్టర్ల చేత వైద్య పరీక్షలు నిర్వహించడ మే కా కుండా, మందులు, తదుపరి వైద్య సేవలను అందిస్తున్నట్లు చె ప్పారు. రోగులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ప్రత్యేకంగా ఒ క ఐడి నెంబర్ ఇవ్వడం జరుగు తుందని, దా ని ఆధారంగా వైద్య సేవలు అందించడంతోపాటు, భవిష్యత్తులో కూడా వైద్య సేవలు అందించ నున్నట్లు వెల్లడించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రతిరోజు రెండు, మూడు పీహెచ్సీలను కవర్ చేస్తూ ఇలా అన్నిపీహెచ్ సిలను కవర్ చే యడం జరు గుతుందని చెప్పారు. ప్ర భుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు,



గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత కార్యక్ర మా లను చేపట్టడం జరుగుతున్న దని, అంతేకాక ఫైళ్ల పరిష్కా రం కూడా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధు లు, అధికారులు అందరి సమన్వ యంతో ప్రజా పాలన, ప్రగతి ప్రణా ళిక 99 రోజుల కార్యాచరణ ప్రణా ళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యలను విని తె లుసుకొని వారి సమస్యల పరిష్కా రానికి డాక్టర్లను ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహె చ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రభు త్వ ప్రధాన ఆస్పత్రి సూపరిం టెం డెంట్ నేత నరసిం హారావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యా ణ్ చక్రవర్తి ,లైన్ వాడ యూ పీ హెచ్ సి డాక్టర్ ఇఫ్తేయార్, లైన్ వాడ కార్పొరేటర్ మహమ్మద్ ఖా జా సమయుద్దిన్ నదీమ్, డాక్టర్లు తదితరులు ఉన్నారు.

# పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

**మిర్యాలగూడ, మార్చి 6 (నినాదం):** పెండింగ్లో ఉన్న బీసీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ శుక్రవారం వినతి పత్రం అందజేస్తున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



తిరుమలగిరి అశోక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులు ప్రభుత్వ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లపై ఆధారపడి విద్యని అభ్యసిస్తున్న సందర్భంలో ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సినటువంటి స్కాలర్షిప్స్ నేటికీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు పరీక్షల సమయంలో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు ఫీజు చెల్లిస్తేనే కులాశాల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ఇస్తామంటూ లేకపోతే హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను బెదిరిస్తున్న సందర్భం అలాగే కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను చివరి ఇబ్బందులకు గురి చేస్తున్నానన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలో చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో.. జక్కు నాగేశ్వరావు, పోలగానే వెంకటేష్ గౌడ్, ఎర్రబెల్లి గంగాధర్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు జామెట్రీ బాక్సులు అందజేత



**కమలాపూర్, మార్చి 6 (నినాదం):** మండలంలోని మద్రిపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల వార్షిక పరీక్షల సందర్భంగా శుక్రవారం మద్రిపల్లి గూడెం రెడ్డి సంఘము ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులు అంద చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు రాజేశ్వరరావు , రెడ్డి సంఘం అధ్యక్షులు రిక్కల శివారెడ్డి, ఉపాధ్యక్షులు కొలను వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను రామిరెడ్డి, కోశాధికారి వంగ శ్రీనివాస్ రెడ్డి, సంఘ సభ్యులు బద్దిపడుగు రాజు, వంగరాజు, బద్దిపడుగ శ్రీనివాస్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు ,తదితరులు,పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసం కృషి చేస్తా..

### • బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి

**డోర్నకల్ / మరిపెడ మార్చి 06(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ చైర్పర్సన్గా వీసారపు ప్రగతి శ్రీపాల్రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మరిపెడ మున్సిపాలిటీ కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా పూలదండలు, బొకేలతో స్వాగతం పలికారు. వైస్ చైర్మన్గా కాలం సునీత రవీందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని,గతంలో వార్డ్ కౌన్సిలర్గా పదవి బాధ్యతలు చేపట్టిన అనుభవం ఎంతో ఉందన్నారు. మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధి చెందడానికి ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలో ముందుగానే తెలిసిన నాయకురాలిగా అనుభవం ఉందన్నారు. నమ్మి ఓటేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వార్డులోని కౌన్సిలర్ అందరిని ఏకం చేసి ప్రతి వార్డును అభివృద్ధి చేస్తానన్నారు.వార్డ్ కౌన్సిలర్ గా బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమంలో మరిపెడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



రఘువీరారెడ్డి,రాంపురం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రవి నాయక్, టౌన్ అధ్యక్షులు తాజ్జుదిన్ ,కాంగ్రెస్ నాయకులు అఫ్జల్,అలావల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి బిక్షపతి, కారంపొడి ఉపేందర్,వార్డ్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# రూబీ కాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ




**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 6 (నినాదం):** శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రథమ ద్వితీయ తృతీయ సంవత్సరం విద్యార్థులకు రూబీ కాన్ ట్రైనింగ్ అండ్ కోఆర్డినేటర్ హాబిష బ్లెస్సి ఆధ్వర్యంలో విద్యార్థులకు మొబిలైజేషన్, శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... విద్యార్థులు ఇంటర్వ్యూను సులభ పద్ధతిలో ఎదుర్కొనే విధంగా మెలుకువలను నేర్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను అలవరచుకుంటే డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఎన్నో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రూబీ కాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కళాశాల నుండి విద్యార్థులను ఎంపిక చేస్తున్నామని అందుకు సహకరిస్తున్న కళాశాల యాజమాన్యానికి ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వి వెంకటేశులుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికే ప్రగతి ప్రణాళిక

### 99రోజుల ప్రజాపాలనను పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో(నినాదం):** జిల్లాలో సమగ్ర అభివృద్ధి మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన .. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలు వివిధ విభాగాల సమన్వయంతో నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రతి శాఖకు సంబంధించి నోడల్ విభాగాలు, నోడల్ అధికారులు నియమించబడినట్లు ఆయన పేర్కొన్నారు. మార్చి 6 నుండి మార్చి 15, వరకు శుభ్రత ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్, పంచాయతి రాజ్ ఇతర ప్రభుత్వ విభాగాలు నోడల్ విభాగాలుగా పనిచేస్తాయని అన్నారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు రోడ్డు భద్రత అలైవ్ అరీవ్ అనే థీమ్ తో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. రక్షణాత్మక డ్రైవింగ్ ప్రచారాలు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ డ్రైవ్లు, గ్రామ రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు, సమారిటన్ గుర్తింపు కార్యక్రమాలు చేపట్టబడతాయని తెలిపారు. అలాగే ఓ ఆర్ ఆర్ హైవేలపై భారీ వాహనాల అనధికార పార్కింగ్ను నివారించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు మహిళలు పిల్లల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మహిళలు పిల్లలపై జరిగే నేరాలను నివారించేందుకు చర్యలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించబడతాయని,. ఈ కార్యక్రమాల్లో ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ మరియు గృహనిర్మాణ శాఖలు భాగస్వామ్యం అవుతాయన్నారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు మహిళలు పిల్లల పోషణ అంశంపై కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, 0--6 సంవత్సరాల పిల్లలు కౌమార బాలికల ఆరోగ్య పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సాహం, పోషకాహార వంటకాల పోటీలు సమాజ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 4 నుండి మే 10 వరకు వ్యవసాయ అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు, వ్యవసాయం, ఆదాయం, నీటిపారుదల విభాగాల సమన్వయంతో రైతులకు సాంకేతిక మార్గదర్శకాలు అందించబడతాయని తెలిపారు.. మే 11 నుండి మే 16 వరకు విద్య, సౌకర్యాలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని, మే 18 నుండి మే 23 వరకు యువత క్రీడలు అంశంపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 25 నుండి మే 30 వరకు మహిళల సాధికారతపై కార్యక్రమాలు నిర్వహించబడతాయని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలతో చర్చలు నిర్వహించి మహిళల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, వన మహోత్సవం కింద చెట్ల నాటడం, పచ్చదనం పెంపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే అంశాలపై కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# పదో వార్డులోని డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

### మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవియాదవ్

**అమరచింత, మార్చి 6, (నినాదం):** అమరచింత మునిసిపాలిటీ కేంద్రం లోని పదో వార్డులో డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తామని మునిసిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ అన్నారు. వార్డులోని డ్రైనేజీ నుండి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం చైర్ పర్సన్ డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీ పైకప్పు లేకపోవడంతో దుర్వాసన వస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ ఒకపక్క నిర్మాణం లేకపోవడంతో పై కప్పు మూయడం సాధ్యం కాదని సైడ్ నిర్మాణం చేసి పైకప్పు మూసివేస్తామని కాలనీవాసులకు చైర్పర్సన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ మాధవి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, జింక రవి, ముదిరాజ్ రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జి.ఎస్. గోపి సిపిఎం నాయకులు బి.వెంకటేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.



### 29వ వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్గా జావీద్ ప్రమాణ స్వీకారం

**మిర్యాలగూడ మార్చి 6 (నినాదం):** మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్గా అత్యధిక మెజార్టీతో విజయం సాధించి ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా మిర్యాలగూడ పట్టణంలోని 29వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ జావీద్ ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరైనారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్, కౌన్సిలర్లు మలగం రమేష్, నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి, అనిత, ఇలియాస్, ఫారుక్ మొహమ్మద్, హామీదుద్దీన్(మొయిజ్) బూడిద సైదులు, సలీం, నిషిత్ యాదవ్, మలగం రమేష్, ఆరిఫా అబ్దుల్లా, షబానా బేగం అయూబ్, షేక్ సాహేరా బేగం, పెద్ది శ్రీనివాస్ గౌడ్, శ్రీజ, బిక్షం, వివిధ వార్డుల కౌన్సిలర్లు తోపాటుఈకార్యక్రమంలోడిఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీడ్కోలు సమావేశం



**మిర్యాలగూడ, మార్చి 6 (నినాదం):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్ప గూడెం నందు 2025-26 విద్యాసంవత్సరం నందు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగాలని ఉన్నత పౌరులు అనగానే డబ్బో, హోదానో కాకుండా జీవితంలో సమాజంలో తోటి వ్యక్తులకు సహాయ సహకారాలు అందిస్తూ అందరిచేత మంచనిపించుకుంటూ బ్రతికే వ్యక్తి, నైతిక విలువలను పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తూ, కొవ్వొత్తి లా తను వెలుగుతూ పదిమందికి వెలుగునిస్తున్నట్లుగా ఇతరులకు ఉపయోగపడే వ్యక్తి సమాజ చైతన్యానికి స్ఫూర్తి నింపుతాడని, అందుకోసమే విద్యార్థులు భవిష్యత్తులో కొవ్వొత్తి లాగా వెలుగుతూ సమాజ చైతన్యానికి ప్రయత్నం చేస్తూ మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి, జల్ రామ్, చంద్రకళ, రవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మొలుగూరి గోపయ్యకు సన్మానం



**కోదాడ,మార్చి 6 (నినాదం):** అనంతగిరి మండలం వాయిల సింగవరంలో గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద నంది పురస్కార గ్రహీత, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. మొలుగూరి గోపయ్యను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ఆయన అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయంపై నాలుగేళ్లుగా చేపట్టిన రైతు చైతన్య యాత్రకు గుర్తింపుగా నంది పురస్కారం లభించిందని డా. గోపయ్య తెలిపారు. కార్యక్రమంలో కొల్లు సుబ్బారావు,దాములూరి మురళి, చిప్పల రాంబాబు,, పగిడి ఉపేందర్, పగిడి వెంకటేశ్వర్లు, కల్లేపల్లి నరసింహ, జంగిలి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన

**కమలాపూర్, మార్చి 6 (నినాదం):** మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసిన మార్కెటింగ్ అధికారులు.మండలంలోని పలు గ్రామాలకు కూడలిగా ఉన్న కమలాపూర్ మండల కేంద్రంలో రైతులు రామాలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయలు విక్రయిస్తున్నారు. పెరిగిన జనాభా కారణంగా కూరగాయల మార్కెట్ వల్ల అటు రైతులు ఇటు ప్రజలు చాలా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు.కమలాపూర్ లో కూరగాయల మార్కెట్ అవసరాన్ని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్ మార్కెట్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు పోయారు.కమలాపూర్ మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ యార్డును నిర్మించడానికి జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్లేష్,గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో స్థల పరిశీలన చేశారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని నిర్ధారించిన తరువాత వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో అధునాతన కూరగాయల మార్కెట్ యార్డును నిర్మిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్



కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రవిందర్ ,మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, డైరెక్టర్లు సముద్రాల కృష్ణ ,జనగాని శివకృష్ణ ,ఆకినపల్లి బిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి ,ఆన్కార్ అశోక్ జి, మాజీ సర్పంచ్ లు గంధసరి రవికుమార్, శనిగరం సమ్మయ్య,మౌటం చిరంజీవి, రైతులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**అమరచింత, మార్చి 6, (నినాదం):** వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 261 మంది విద్యార్థులకు గాను 253 మంది విద్యార్థులు హాజరయ్యారు. 08 మంది విద్యార్థులకు గైహాజరయ్యారు. వికాస్ జూనియర్ కళాశా లలో 89 మంది విద్యార్థులకు 86 మంది విద్యార్థులు హాజరయ్యారు. 03 విద్యార్థు లు పరీక్షకు గైహాజరయ్యారు. ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగు తున్నాయని చీఫ్ ఎగ్జామినేషన్ అధికారి ప్రిన్సిపాల్ సైదులు, టిజె విశ్వేశ్వర్ తెలిపారు.

